క్లుప్తంగా

కాకాణికి అభినందన



కాకాణికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న నాయకులు

వెంకటాచలం : ఉమ్మడి నెల్లూరు జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడిగా నియమితులైన మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డికి ఆదివారం వెంకటాచలం మండలం నుంచి నాయకులు, ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు భారీగా తరలివెళ్లి అభినందనలు తెలిపారు. నెల్లూరు నగరంలోని కాకాణి నివాసంలో కలిసి శాలువాలతో సన్మానించి, పుష్పగుచ్ఛం ఇచ్చి అభినందనలు తెలియజేశారు.

అక్టోబర్ 3 నుంచి శరన్నవరాత్రులు

బుచ్చిరెడ్డిపాళెం రూరల్ : మండలంలోని జొన్నవాడలో కొలువైన మల్లికార్జున సమేత కామాక్షితాయి అమ్మవారి శరన్నవరాత్రులు అక్టోబర్ 3వ తేదీ నుంచి మొదలవుతాయని ఈఓ అర్వభూమి వెంకట శ్రీనివాసులురెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అక్టోబర్ 12వ తేదీ వరకు వివిధ పూజా కార్యక్రమాలు, అమ్మవారిక ప్రత్యేకాలంకారాలు జరుగుతాయని వివరించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి, అమ్మవారిని దర్శించుకోవాలని కోరారు.

వధూవరులకు ఆశీర్వాదం



వివాహ వేడుకలో ప్రసన్న, కాటంరెడ్డి తదితరులు

బుచ్చిరెడ్డిపాళెం రూరల్ : పట్టణంలోని కేవీఆర్ ఫంక్షన్ హాల్లో నగర పంచాయతీ ఐదో వార్డు కౌన్సిలర్ షాహుల్ కుమారుడు సల్మాన్ వివాహం ఆదివారం జరిగింది. ఈ కార్యక్రమానికి మాజీ మంత్రి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కాటంరెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డి హాజరై వధూవరులను ఆశీర్వదించారు. కార్యక్రమంలో నగర పంచాయతీ కౌన్సిలర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం నేడు


కోవూరు : మండలంలోని పడుగుపాడు సబ్‌స్టేషన్ పరిధిలో రోడ్డు విస్తరణకు విద్యుత్ లైన్లను మారుస్తున్న క్రమంలో సోమవారం ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ట్రాన్స్‌కో డీఈ మధుసూదన్ రెడ్డి తెలిపారు. ఈ మేరకు ఆయన ఆదివారం తన కార్యాలయంలో మాట్లాడారు. సబ్‌స్టేషన్ పరిధిలోని కాటంరెడ్డి రామచంద్రారెడ్డి నగర్, చంద్రమౌళినగర్, శ్రీనివాసనగర్, పెద్ద పడుగుపాడు, ఎన్టీఆర్ కాలనీ ప్రాంతాల్లో అంతరాయం ఉంటుందని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం



ఘటనా స్థలం..

సంగం: మండలంలోని కొరిమెర్ల సమీపంలో ఆదివారం రాత్రి బైక్, ఆర్టీసీ బస్సు ఢీకొన్న ప్రమాదంలో ఓ యువకుడు దుర్మరణం పాలయ్యాడు. వివరాలు.. నరసారావుపేటకు చెందిన వీ నరసింహరావు(24) 15 ఏళ్ల క్రితం తల్లిదండ్రులతో కలిసి విడవలూరు మండలం అన్నారెడ్డిపాళేనికి వచ్చారు. తల్లిదండ్రులు వ్యవసాయ పనులు చేసుకుంటుండగా, నరసింహరావు వరికోత మెషీన్ డ్రైవర్‌గా పనిచేస్తున్నారు. ఆదివారం రాత్రి ఏఎస్‌పేట గంధ మహోత్సవానికి మోటార్‌సైకిల్‌పై బయలుదేరాడు. కొరిమెర్ల సమీపంలోని అమ్మ ఆదిపరాశక్తి ఆశ్రమం వద్ద ఎదురుగా వస్తున్న ఏఎస్‌పేట నుంచి నెల్లూరు వెళ్తున్న ఆర్టీసీ బస్సును ఢీకొని అక్కడికక్కడే మృతి చెందారు. సంగం పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



నరసింహరావు మృతదేహం

సంగీత విభావరి నేడు

నెల్లూరు(బృందావనం): పురమందిరంలో నటుడు నందమూరి బాలకృష్ణ సినీ స్వర్ణోత్సవ సంబరాలను సోమవారం నిర్వహించనున్నామని సృజన సాహిత్య, సాంస్కృతిక వేదిక అధ్యక్షుడు రాధాకృష్ణ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సినీ సంగీత విభావరిని సాయంత్రం నుంచి రాత్రి వరకు నిర్వహించనున్నామని పేర్కొన్నారు.

ప్రమాదాలకు నెలవు.. హైవే క్రాసింగ్‌లు

కొడవలూరు మండల పరిధిలో సుదీర్ఘమైన జాతీయ రహదారి ఉంది. ఇందులో కొన్ని క్రాసింగ్‌లు అత్యంత ప్రమాదభరితంగా ఉన్నాయి. అయినప్పటికీ ఇలాంటి కీలకమైన ప్రాంతాల్లో అండర్ పాస్‌లు, ఫ్లైఓవర్ బ్రిడ్జిలు నిర్మించలేదు. దీంతో తరచూ ప్రమాదాలు జరిగి ఎంతో మంది ప్రాణాలు గాల్లో కలిసిపోతున్నాయి. దీనిపై ఆయా గ్రామాల వారు హైవే అథారిటీ అధికారులు, ప్రజా ప్రతినిధులకు ఎన్నోసార్లు మొరపెట్టుకున్నారు. అయినప్పటికీ వారి మొర ఆలకించేవారు లేకుండా పోయారు. ఫలితంగా టపాతోపు, రామన్నపాళెం రోడ్డు క్రాసింగ్‌లు ప్రమాదాలకు నెలవుగా మారాయి.



టపాతోపు వద్ద హైవేపై ప్రమాద భరితంగా రోడ్డును క్రాస్ చేస్తున్న వాహనాలు

- తరచూ ప్రమాదాలు జరుగుతున్నా.. పట్టించుకోని అధికారులు
- గాల్లో కలుస్తున్న ప్రజల ప్రాణాలు
- ఆవేదన వ్యక్తం చేస్తున్న గ్రామీణ ప్రజలు

కొడవలూరు: మండలంలో ప్రధాన వాణిజ్య కేంద్రమైన నార్తురాజుపాళెం వెళ్లాలన్నా లేక విడవలూరు, అల్లూరు, కొడవలూరులకు వెళ్లాలన్నా టపాతోపు వద్ద జాతీయ రహదారిని క్రాస్ చేయాల్సి ఉంది. ఇక్కడ నిత్యం పదుల సంఖ్యలో వాహనాలు రోడ్డు క్రాస్ చేస్తుంటాయి. ఇంతటి కీలకమైన రోడ్డు క్రాసింగ్ వద్ద హైవే అథారిటీ అధికారులు ఫ్లైఓవర్ గానీ, అండర్ పాస్ గానీ నిర్మించలేదు. దీంతో రోడ్డు క్రాస్ చేసే సమయంలో తరచూ ప్రమాదాలు జరిగి ప్రాణాలు హరీ మంటున్నాయి. ఇక్కడ రోడ్డు క్రాస్ చేస్తున్నప్పుడు నెల్లూరు వైపు వేగంగా వెళ్తున్న వాహనాలు కనిపించడం లేదు. దీంతో వాహనదారులు రోడ్డు క్రాస్ చేసేందుకు యత్నిస్తున్నారు. నెల్లూరు వైపు వేగంగా వెళ్తున్న వాహనాలకు వేగం అదుపు కాక రోడ్డు క్రాస్ చేస్తున్న వాహనాలను ఢీకొంటున్నాయి.

పట్టించుకోని హైవే అథారిటీ

పై రెండు క్రాసింగ్‌ల వద్ద తరచూ ప్రమాదాలు జరుగుతూ ప్రాణాలు కోల్పోతున్నారని, కనీసం అండర్ పాస్‌లైనా నిర్మించి ప్రాణాలు కాపాడాలని బాధిత గ్రామాల వారు అనేక పర్యాయాలు హైవే అథారిటీ అధికారులకు మొరపెట్టుకున్నారు. ప్రజా ప్రతినిధులకూ అనేక పర్యాయాలు వినతిపత్రాలు సమర్పించారు. అయినప్పటికీ హైవే అథారిటీ అధికారుల్లో ఎలాంటి స్పందన కన్పించడం లేదు. ప్రజల ప్రాణాలే కదా మనకెందుకులే అన్నట్లుగా వ్యవహరిస్తున్నారే తప్ప సమస్యను తీవ్రంగా పరిగణించడం లేదు. దీంతో ఈ క్రాసింగ్‌ల వద్ద ప్రమాదులు నిత్యకృత్యమయ్యాయి.

రామన్నపాళెం వద్ద..



రామన్నపాళెం వద్ద హైవే ప్రమాదభరిత క్రాసింగ్

హైవేపై రామన్నపాళెం క్రాసింగ్‌లోనూ ఇదే పరిస్థితి నెలకొంటోంది. ఇక్కడ రైల్వే ట్రాక్ అవతలి వైపు రామన్నపాళెం, మానేగుంటపాడు, ఆలూరుపాడు పంచాయతీలు ఉన్నాయి. విడవలూరు మండలంలోని పార్లపల్లి, విడవలూరులకు కూడా ఇదో దగ్గరి మార్గంగా ఉంది. దీంతో నిత్యం ఇక్కడి వారు నెల్లూరు, కోవూరులకు వివిధ అవసరాలపై వెళ్తుంటారు. వీరంతా రోడ్డు క్రాస్ చేసి వెళ్లాల్సి ఉంటుంది. ఇక్కడా ఎలాంటి అండర్ పాస్, ఫ్లైఓవర్ బ్రిడ్జి లేకపోవడం వల్ల రోడ్డు క్రాస్ చేస్తున్న సమయంలో ప్రమాదాలు జరిగి ప్రాణాలు గాల్లో కలిసిపోతున్నాయి. పై రెండు క్రాసింగ్‌ల వద్ద కనీసం నెలకొకరు వంతున ప్రాణాలు కోల్పోతుండగా, గాయాల బారిన పడి వికలాంగులుగా మారుతున్నవారు ఎక్కువ సంఖ్యలో ఉంటున్నారు.

ప్రజాప్రతినిధులైనా జోక్యం చేసుకోవాలి



రైల్వే ట్రాక్ ఇవతల మూడు పంచాయతీలుండడంతో పాటు విడవలూరు మండలంలోని అనేక గ్రామాలకు వెళ్లేందుకు ఇక్కడి మెయిన్ రోడ్డు ఉపకరిస్తోంది. అందువల్ల ఇక్కడి రోడ్డును క్రాసింగ్ చేసే వాహనాలు, పాదచారుల సంఖ్య ఎక్కువగా ఉంటుంది. ఇలా రోడ్డు క్రాస్ చేస్తున్న సమయంలో మహిళలు కూడా ప్రమాదాలకు గురై ప్రాణాలు కోల్పోవడంతో పాటు వికలాంగులుగా మారుతున్నారు. ఇక్కడ అండర్ పాస్ నిర్మించాలని అనేక పర్యాయాలు హైవే అథారిటీ అధికారులు, ప్రజా ప్రతినిధులను కోరాం. కానీ ఇప్పటివరకు సమస్య పరిష్కారం కాలేదు. ప్రజాప్రతినిధులైనా చొరవ చూపి సమస్యను పరిష్కరించి ప్రాణాలు కాపాడాలని విజ్ఞప్తి చేస్తున్నాం.

– కాకి శ్రీనివాసులు, రామన్నపాళెం, కొడవలూరు మండలం

ప్రజల ప్రాణాలంటే లెక్కలేదు



ప్రజల ప్రాణాలంటే హైవే అథారిటీ అధికారులకు ఏ మాత్రం లెక్కలేదు. టపాతోపు క్రాసింగ్ వద్ద జరుగుతున్న ప్రమాదాలను దృష్టిలో పెట్టుకుని ఎన్నో పర్యాయాలు కనీసం అండర్ పాస్ నిర్మించడం ద్వారానైనా ప్రమాదాలను నివారించాలని కోరాం. అడిగినప్పుడు మాత్రం పరిశీలిస్తామంటారే తప్ప ఆ తరువాత పట్టించుకోరు. దీంతో ఈ క్రాసింగ్ అత్యంత ప్రమాద భరితంగా మారి ఎంతో మంది ప్రాణాలు గాల్లో కలిసిపోతున్నాయి.

– పి.మధుసూదన్‌రెడ్డి, నార్తురాజుపాళెం, కొడవలూరు మండలం

వైద్య శిబిరానికి విశేష స్పందన



వృద్ధుడి ఆరోగ్యంపై ఆరాతీస్తున్న బిందు మేనన్



బీపీ, షుగర్ పరీక్షలు చేస్తున్న సిబ్బంది

విడవలూరు : మండలంలోని వావిళ్ల గ్రామంలో ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్థానిక సర్పంచ్ ఏటూరి రాజేశ్వరమ్మ ఆధ్వర్యంలో ఉచిత న్యూరాలజీ వైద్య శిబిరాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ క్యాంపునకు బిందు మేనన్ ఫౌండేషన్ అధినేత డాక్టర్ బిందు మేనన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ క్యాంపులో హైపర్ టెన్షన్, మధుమేహం, బీపీ, షుగర్, మతిమరుపు, పక్షవాతం వంటి వాటికి పరీక్షలు చేశామని, ఈ క్యాంపులో దాదాపు 230 మంది వైద్య పరీక్షలు చేయించుకున్నారని, కొందరికి ఇక్కడే ఉచిత మందులు ఇవ్వగా, మరి కొందరిని నెల్లూరులోని తమ ఫౌండేషన్‌ను సంప్రదించాలని సూచించినట్లు తెలియజేశారు. అనంతరం హార్ట్ స్ట్రోక్ లక్షణాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు మాజీ ఎంపీటీసీ ఏరూరి హరిరెడ్డి, మోర్ల శివ ప్రసాద్, కమతం శ్రీనాథ్, కోలగట్ల సుమ, పులింద్ర సతీష్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌ఈఐఎల్ ఎనర్జీకి రెండు అవార్డులు



అవార్డు అందుకుంటున్న సీనియర్ జనరల్ మేనేజర్ అల్తాఫ్

ముత్తుకూరు : ముత్తుకూరు మండలం, నేలటూరులోని ఎస్‌ఈఐఎల్ ఎనర్జీ ఇండియా లిమిటెడ్‌కు రెండు ప్రతిష్టాత్మకమైన అవార్డులు దక్కినట్లు సంస్థ ప్రతినిధులు ఆదివారం వెల్లడించారు. ఇందులో భాగంగా ఆసియన్ హౌస్ కీపర్స్ అసోసియేషన్, క్లీన్ ఇండియా జర్నల్ సంయుక్తంగా లక్నోలో నిర్వహించిన ఇంటర్నేషనల్ హౌస్ కీపర్స్ సమ్మిట్–2024లో ఈ సంస్థకు 'బెస్ట్ హౌస్ కీపింగ్ ప్రాక్టీసెస్(ఇండస్ట్రియల్ కేటగిరీ) విభాగంలో మొదటి అవార్డును అందుకుంది. సీనియర్ జనరల్ మేనేజర్ అల్తాఫ్ షేక్ ఈ అవార్డును అందుకున్నారు. అలాగే, చెన్నైలో జరిగిన 'ఐఎస్‌ఎఫ్‌హెచ్‌ఆర్‌ఏ అవార్డ్స్–2024'లో ఈ ఎనర్జీ సంస్థ 'గోల్డ్ అవార్డు' అందుకుంది. సీనియర్ మేనేజర్ పొడుగు నాగేశ్వరరావు ఈ అవార్డును అందుకున్నారు. సంస్థ సీఈఓ రాఘవ్ త్రివేది సిబ్బందిని అభినందించారు.

మహిళలు ఉద్యమాల్లో పాల్గొనాలి

- ఐద్వా రాష్ట్ర కార్యదర్శి రమాదేవి



ఫిక్స్‌డ్ డిపాజిట్ చెక్‌ను అందజేస్తున్న యూటీఎఫ్, ఐద్వా నాయకులు

బుచ్చిరెడ్డిపాళెం రూరల్ : మహిళలు చైతన్యం కలిగి, ఉద్యమాల్లో చురుగ్గా పాల్గొనాలని ఐద్వా రాష్ట్ర కార్యదర్శి రమాదేవి అన్నారు. పట్టణంలోని పద్మావతి కల్యాణ మండపంలో యూటీఎఫ్ ఆధ్వర్యంలో ఆదివారం మహిళా సదస్సు జరిగింది. కార్యక్రమానికి హాజరైన పద్మావతి మాట్లాడుతూ మహిళలు చదువుకోవడం ద్వారా సమాజం వేగంగా అభివృద్ధి చెందుతుందన్నారు. మహిళా ఉపాధ్యాయులు సామాజిక ఉద్యమాల్లో తప్పకుండా పాల్గొనాలని పిలుపునిచ్చారు. అనంతరం అమ్మవారితోపు పాఠశాలలో కరెంట్‌షాక్‌తో మృతిచెందిన వ్యక్తి కుటుంబ సభ్యులకు యూటీఎఫ్ మండలశాఖ తరఫున రూ.72,000లను ఫిక్స్‌డ్ డిపాజిట్ రూపంలో అందించారు. కార్యక్రమంలో ఐద్వా సభ్యులు, యూటీఎఫ్ జిల్లా, మండల సభ్యులు పాల్గొన్నారు.

నిత్యావసరాల ధరలు పైపైకి..

- దసరా కానుక అంటున్న వినియోగదారులు
- పేద, మధ్య తరగతి ప్రజలపై పెనుభారం



నిత్యావసర సరుకులు

పొదలకూరు : నిత్యావసర ధరలు మరింత ప్రియంగా మారుతున్నాయి. కొనబోతే కొరివి అమ్మబోతే అడవి అన్న చందంగా ధరలు పెనుభారంగా మారుతున్నాయి. దీనికితోడు గోరుచట్టుపై రోకటిపోటులా కూరగాయల ధరలు దిగిరావడం లేదు. ఫలితంగా సామాన్య మానవుడు ఏమికొనేటట్టు లేదు, ఏమీ తినేటట్టు లేదంటున్నాడు. కేంద్ర ప్రభుత్వం వంట నూనెపై దిగుమతి సుంకం అమాంతం పెంచడంతో నిత్యం వినియోగించే నూనె ప్యాకెట్లపై రూ.15 నుంచి రూ.20 అదనంగా ధరలు పెరిగినట్లు వ్యాపారులు వెల్లడించారు. దసర కానుకగా ధరలు మరింత పెరుగుతున్నట్లు గృహిణులు వాపోతున్నారు.

వివాహాల సీజన్‌లో తడిసి మోపెడు

అక్టోబరు మాసంలో వివాహ ముహూర్తాలు ఇబ్బడి ముబ్బడిగా ఉన్నాయి. పెళ్లి సందర్భంగా బంధుమిత్రులకు భోజనాల ఏర్పాటులో నిత్యావసర సరుకులదే కీలకం. వీటి కొనుగోలు కోసం శుభకార్యం చేసేవారు అదనంగా నగదు ఖర్చు చేయాల్సి ఉంటుంది. ఈ సందర్భంగా క్యాటరింగ్ నిర్వాహకులు సైతం భోజనాల ధరలు పెంచేశారు. నిత్యావసర వస్తువులు, కూరగాయల ధరలు విపరీతంగా పెరిగాయని తలొక్కటింటికి ధర పెంచి చెబుతున్నారు. గ్రామీణ ప్రాంతాలు, పట్టణాల్లో క్యాటరింగ్ నిర్వహించే వారు ఇదివరకు పర్‌హెడ్ రూ.125 నుంచి రూ.130, రూ.140 రకరకాలుగా తీసుకునే వారు. ఇప్పుడు ఏకంగా రూ.150 వరకు పెంచేశారని చెప్పుకుంటున్నారు. ధరలు దిగివస్తేనే మధ్యతరగతి వారు ఊపిరి పీల్చుకుంటారని భావిస్తున్నారు.

పెరిగిన ధరలు ఇలా..

బియ్యం క్వింటాల్‌కు రూ.300 నుంచి రూ.500 వరకు
కందిపప్పు (కిలో) రూ.150 నుంచి రూ.185
పెసరపప్పు (కిలో) రూ.135 నుంచి రూ.150
మినపపప్పు (కిలో) రూ.120 నుంచి రూ.135
ఉల్లి (కిలో) రూ.60
వెల్లుల్లి (కిలో) రూ.360
ఎండు మిర్చి(నాటువి) రూ.400

యథేచ్ఛగా గ్రావెల్ తరలింపు



ట్రాక్టర్‌లో తరలిస్తున్న గ్రావెల్

మనుబోలు : మండలంలోని గురివిందపూడి రెవెన్యూ పరిధిలో ఉన్న ప్రభుత్వ భూముల నుంచి గుర్తు తెలియని వ్యక్తులు యథేచ్ఛగా గ్రావెల్‌ను తరలిస్తున్నారు. గత కొన్ని రోజులుగా ఇక్కడి నుంచి పోర్టు వైపు ట్రాక్టర్లలో గ్రావెల్ తరలిస్తున్నారని గ్రామస్తులు చెబుతున్నారు. అధికార పార్టీ నాయకుల అండతోనే సరైన అనుమతి పత్రాలు లేకుండా గ్రావెల్ తరలిస్తున్నారని వెల్లడిస్తున్నారు. సెలవు రోజుల్లో అడిగే వారు ఉండరన్న ఉద్దేశంతో గ్రావెల్ తరలింపు భారీగా ఉంటుందని అంటున్నారు.

ఉత్సాహంగా ఎడ్ల పందేలు



బహుమతి అందజేస్తున్న మధు తదితరులు



పోటీలో తలపడుతున్న ఎడ్లు

బుచ్చిరెడ్డిపాళెం రూరల్ : మండలంలోని పాత మినగల్లు గ్రామంలో రాష్ట్రస్థాయి జూనియర్ ఎడ్ల పందేలు ఆదివారం ఉత్సాహంగా జరిగాయి. వైఎస్సార్‌సీపీ నాయకుడు పి.మధు ఆధ్వర్యంలో జరిగిన పోటీల్లో నెల్లూరు జిల్లాతో పాటు ఇతర జిల్లాల నుంచి పోటీల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మధు మాట్లాడుతూ మినగల్లు గ్రామానికి చెందిన మోచర్ల మహేష్ ఎడ్లు మొదటి బహుమతి దక్కించుకున్నాయన్నారు. పాటూరు, సీతారామపురానికి చెందిన ఎడ్లు రెండు, మూడు స్థానాల్లో నిలిచాయని తెలిపారు. మొదటి బహుమతి సాధించిన మహేష్‌కు రూ.15,016, రెండో బహుమతికి రూ.12,016, మూడో బహుమతికి రూ.10,016 అందించామని పేర్కొన్నారు. నాలుగు, ఐదు స్థానాలు సాధించిన వారికి కూడా నగదు బహుమతులు అందించామని వివరించారు. గ్రామీణ క్రీడలు మన సంస్కృతి, సాంప్రదాయాలకు నిలువుటద్దమని, అందులో భాగంగా రాష్ట్రస్థాయి ఎడ్ల పందేలు నిర్వహించామని అన్నారు. పందేల నిర్వహణకు సహకరించిన గ్రామ నాయకులు, ప్రజలందరికీ ధన్యవాదాలు తెలియజేశారు. కార్యక్రమంలో సీహెచ్ నరేంద్ర, కమిటీ సభ్యులు పవన్, వినోద్, ఖాదర్ తదితరులు పాల్గొన్నారు.

‘సూర్యఘర్’తో వెలుగులు

- రాయితీతో సోలార్ రూఫ్ టాప్ ప్యానెల్స్
- పీఎం సూర్యఘర్ యోజన కింద సబ్సిడీ
- వినియోగదారులకు బ్యాంకు రుణాలు



సోలార్ ప్యానెల్

పొదలకూరు : నగర, పట్టణ, గ్రామాల్లో విద్యుత్‌ను ఆదా చేసుకునేందుకు ప్రధాన మంత్రి సూర్యఘర్ యోజన కింద సోలార్ విద్యుత్‌ను ఏర్పాటు చేసుకునేందుకు కేంద్ర ప్రభుత్వం రాయితీలను ప్రకటించింది. రాయితీ నగదుతో పాటు సోలార్ సిస్టమ్‌ను అమర్చుకునేందుకు అయ్యే ఖర్చును బ్యాంకులు రుణాల కింద అందజేయనున్నాయి. ఈ పథకంలో గృహ వినియోగదారులు సోలార్ విద్యుత్‌ను వాడితే అతితక్కువ విద్యుత్ బిల్లులు చెల్లించే అవకాశం ఉంటుందని విద్యుత్ అధికారులు వెల్లడిస్తున్నారు. ఇంటి పైన కనీసం 10 చదరపు అడుగుల స్థలంలో వన్ కేడబ్ల్యూపీ సామర్థ్యం కలిగిన సోలార్ రూఫ్ టాప్‌ను ఏర్పాటు చేసుకుంటే విద్యుత్ ఆదా అవుతుందంటున్నారు. ఈ పథకంలో భాగంగా బ్యాంకులు తక్కువ వడ్డీతో రుణాలు అందజేసేందుకు సిద్ధంగా ఉన్నాయి. అయితే ఈ పథకం గృహ వినియోగదారులకు మాత్రమే వర్తిస్తుంది. వాణిజ్య పరమైన విద్యుత్ వాడకం దారులకు పథకం వర్తించదు.

సోలార్ రాయితీలు ఇలా..

సోలార్ రూఫ్ టాప్ ఏర్పాటులో భాగంగా 1 కిలో వాట్‌తో 120 యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి అవుతున్నందున సాధారణంగా రూ.వెయ్యి బిల్లు వచ్చే వినియోగదారునికి రూ.338 మాత్రమే వస్తుంది. ఇందుకోసం ప్రభుత్వం రూ.30 వేలు రాయితీ ఇస్తుంది. 2 కిలోవాట్‌తో 240 యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి అవుతున్నందున సాధారణంగా రూ.2 వేలు బిల్లు వచ్చే వినియోగదారునికి రూ.333 మాత్రమే వస్తుంది. ఇందుకోసం ప్రభుత్వం రూ.60 వేలు రాయితీని అందజేస్తుంది. 3 కిలో వాట్‌తో 360 యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి అవుతున్నందున సాధారణంగా రూ.3 వేలు బిల్లు వచ్చే వినియోగదారునికి తక్కువ విద్యుత్ బిల్లు వస్తుంది. ఇందు కోసం ప్రభుత్వం రూ.78 వేలు రాయితీని అందజేస్తోంది. ఈ పథకం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంతో అమలు చేస్తున్నాయి. దరఖాస్తు చేసుకోవాలనుకునే వారు ఏపీఎస్‌పీడీసీఎల్ వెబ్‌సైట్ ద్వారా పీఎం సూర్యఘర్ పోర్టల్‌లో దరఖాస్తు చేసుకోవచ్చునని పొదలకూరు విద్యుత్ ఏఈ శ్రీకాంత్ వెల్లడించారు.

కసుమూరులో భక్తుల సందడి





వెంకటాచలం : దక్షిణ భారతదేశంలో ప్రసిద్ధి చెందిన కసుమూరు మస్తాన్‌వలీ దర్గా 247వ గంధ మహోత్సవాలు ఆదివారం రాత్రి 12 గంటల నుంచి ప్రారంభం కానున్న నేపథ్యంలో భక్తులు వేల సంఖ్యలో కసుమూరుకు చేరుకున్నారు. ఈ క్రమంలో వారు తొలుత దర్గాను సందర్శించి, గంధ మహోత్సవం ప్రారంభమయ్యే చందన్‌మహల్ వద్ద సేద తీరారు. గంధ మహోత్సవాల ఏర్పాట్లకు వక్ఫ్‌బోర్డు రూ.14 లక్షలు కేటాయించినట్లు అధికారులు చెబుతున్నారు. ఈ నిధులతో కసుమూరు దర్గా ప్రాంగణంతో పాటుగా పలుచోట్ల విద్యుద్దీపాలు, దర్గాకు పెయింటింగ్, పారిశుద్ధ్య సమస్య లేకుండా అధికారులు చర్యలు చేపట్టనున్నారు. పలుచోట్ల తాగునీరు సరఫరా కేంద్రాలను ఏర్పాటు చేశారు. రాత్రి 12 గంటలకు ప్రారంభమయ్యే గంధ మహోత్సవంలో గంధాన్ని గుర్రంపై గ్రామోత్సవం నిర్వహించి, సోమవారం తెల్లవారుజామున దర్గా వద్దకు చేరుకోనుంది.